
# చీకటి నుండి ఆశ్చర్యకరమైన వెలుగు లోనికి



## బొంతల కృష్ణమూర్తి

## (సహో. తిమోతి గారు)

పుస్తకములు కావలసిన వారు
ఈ క్రింది అడ్రసుకు వ్రాయ మనవి

**హెబ్రోను**
బుక్ రూమ్
గోల్కొండ చౌరస్తా, ముషీరాబాదు,
హైదరాబాదు – 500 020. తెలంగాణ.
ఫోన్ : 040–27613066

# చీకటి నుండి ఆశ్చర్యకరమైన వెలుగు లోనికి

(సహో. బి.తిమోతి గారి సాక్ష్యము)

**బాల్యము :**

సహోదరుడు తిమోతిగారి పేరు బొంతల క్రిష్ణమూర్తి. జననం 1938 డిసెంబర్ 30. స్వగ్రామం మదనపల్లి తండ్రి పేరు బొంతల రామచంద్రశెట్టి, తల్లిపేరు లక్ష్మీకాంతమ్మ. తిమోతి గారికి ఒక అన్న, ఒక అక్క, ఒక చెల్లి ఉన్నారు. తిమోతిగారి తండ్రిది ఉమ్మడి కుటుంబము. ఐదుగురు సహోదరులు గల ఆ కుటుంబము అంతా కలిసి ఒక్కచోట నివసించేవారు. మూడంతస్థుల భవనం ఉండేది. ప్రతివాళ్ళు వారి వారి వ్యాపారాలు చేసుకుంటూ కలిసే యుండే వాళ్ళు. ఇంట్లో ఒక వంటమనిషి ఉండేవాడు. ఆయనే అందరికి వడ్డించే

వాడు. పురుషులందరూ ఒకసారి స్త్రీలందరూ ఒకసారి భోజనం చేసేవారు. బాల్యం నుంచి ఎటువంటి ఆర్ధిక ఇబ్బందులు, కష్టాలు లేవు.

బి.ఎ. డిగ్రీ చదువుతున్నప్పుడు తండ్రితో పాటు వ్యాపారంలో సహాయపడుతూ వచ్చారు. అలాంటి సమయంలో ఒకసారి దుకాణంలో కూర్చొని యుండి నప్పుడు కొన్ని ఆలోచనలు తన మదిలో మెదిలాయి. అవును గాని, కుక్క, కోతి, పంది ఇవన్ని దేవాలయా నికి పోవుగా! నేనే కదా దేవాలయానికి పోయేవాడిని, అసలు దేవుడు మానవుని ఎందుకు సృష్టించాడు? నేను చనిపోతే ఎక్కడికి పోతాననే ప్రశ్నలు బయలు దేరాయి. ఇట్టి తలంపులతో నెమ్మది లేని వాడిగా ఆకాలంలో 500 రూపాయలు తీసుకొని ఇంటి నుండి పారిపోయాడు.

కాశీ నుండి కన్యాకుమారి వరకు ఎన్నో

యాత్రలు చేసి, ఏ భగవంతుడు నన్ను బాగుచేస్తాడు? నా సందేహాలకు ఎవరు జవాబు చెప్తారని ప్రతి గుడిలో ఏడ్చి ఏడ్చి ప్రార్థించాడు. పెద్ద దేవుడు ఆశీర్వాదాలు ఇచ్చి ఇచ్చి అయిపోయి ఉంటాయని, చిన్నదేవుడు దగ్గర ఆశీర్వాదాలు కుప్పగా ఉంటాయోమోనని కనిపించే ప్రతి దేవుణ్ణి మ్రొక్కాడు. ఎక్కడా నెమ్మది దొరకలేదు. చిట్ట చివరికి హైదరాబాదు చేరి పంజాబ్ నేషనల్ లాడ్జిలో ఒక గది తీసుకొని హైదరాబాదులో తిరుగు తున్నాడు. ఈ ప్రజలందరూ ఇంత సంతోషంగా పరుగెడుచున్నారు, నాకేమైంది; దేవుడు లేదు, దయ్యం లేదని నిర్ణయించుకున్నాడు. చనిపోదామని తీర్మానించు కొని చార్మినార్ ఎక్కాడు. దూకడానికి సిద్ధంగా ఉన్నప్పుడు లోపల నుండి ఏదో ఒక స్వరం “నువ్వు ఇప్పుడు క్రిందపడి చనిపోకుండా ఏ బస్సు మీదనో, కారు మీదనో పడి కాలో చెయ్యో విరిగి చావకుండా

బ్రతికితే నీ బ్రతుకంతా అవిటి బ్రతుకే గదా...” అని చెప్తున్నట్లు అనిపించి, దిగి వచ్చేశాడు.

**<u>మారుమనస్సు :</u>**

చావాలనుకున్నా చావలేకపోతున్నానే అని దిగులుతో నడుచుకుంటూ పోతున్నాడు. గోవాకు పోవాలనుకున్నాడు. అక్కడైతే పోర్చుగీసువారు పరిపాలన చేశారు. పాశ్చాత్యుల సంస్కృతి ఉంటుంది. ఏదైనా నేర్చుకోవచ్చని అనుకున్నాడు. మరలా రైలు క్రింద పడదామా? కరెంటు తీగలు పట్టుకుందామా? అని అనుకుంటుండగా ఆ ప్రాంతములోనే ఒక బోర్డు చూశాడు. అది చూడగానే ఏదో నెమ్మది దొరికింది. అప్పటికి తాను తెచ్చుకున్న 500 రూపాయిల్లో 450/- అయిపోయాయి. మిగిలింది 50/- కాని ఏదో నెమ్మది దొరికింది. మరలా అదేదో క్రైస్తవుల బోర్డులే, నాకెందుకులే అని

అనుకున్నాడు. కాని ఆ వాక్యం తనను ఆకర్షించింది. "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము. అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసు నందు నిత్యజీవము" రోమా 6:23. ఇది ఆంగ్లములో వ్రాయబడి యుంది. వెంటనే బోర్డు మీద నున్న చిరునామా ప్రకారము వెళ్ళి వాళ్లను కలిశాడు. వాళ్ళకి తన సంగతంతా చెప్పుకున్నాడు. వాళ్ళు "నీకేమీ పనిలేదంటే ఇక్కడే హెబ్రోను అను స్థలముంది. అక్కడ ఆదివారం ఆరాధన జరుగుతుంది. నీవక్కడకు వెళ్ళితే నీకు నెమ్మది దొరుకుతుందని చెప్పారు. వాళ్ళ మాట ప్రకారం ఆదివారం త్వరగా సిద్ధపడి హెబ్రోను మందిరానికి వెళ్ళాడు.

ఆదివారం ఆరాధన ఆరంభమైంది, తనకేమీ అర్ధంకాకపోయినా, ప్రక్కవాళ్ళను చూసి వాళ్ళు ఏమి

చేస్తే అది చేస్తున్నాడు. బల్ల అనగా యేసు శరీరమునకు, రక్తమునకు సాదృశ్యమైన రొట్టె, ద్రాక్షా రసమును పంచుతున్నప్పుడు తిమోతిగారు కూడా పాలు పొందాడు. అదొక ప్రసాదమను కొన్నాడు. తరువాత భక్తసింగ్‌గారు (పాస్టర్) బల్ల దగ్గర ప్రపంచములోని పలు సమస్యల గురించి, ప్రజలలోని పలు రోగాల గురించి, ప్రభువు నెరగని ప్రజల రక్షణ కొరకు, విశ్వాసుల అక్కర కొరకు పేరు పేరు వరసున ప్రార్థించుచుంటే... ఆ ప్రేమా ప్రార్థన తిమోతిగారిని తాకింది. ఇదేంది! ఒక ఇంట్లో ఇద్దరన్నదమ్ములుంటే ఒకరంటే ఒకరికి పడదు, ఒకడు బాగుపడితే ఇంకొకడు ఓర్చలేడు. ఈయన (భక్తసింగ్) కేమి పట్టిందబ్బా. అందరి గురించి ఇంత భారంగా ప్రార్థిస్తున్నాడు. అని ఆశ్చర్యపోయాడు. ఇందులో ఏదో ప్రత్యేకత ఉందనుకొన్నాడు. భక్తసింగ్ గారు వాక్యం చెప్పే సమయంలో మీలో

కొందరు సినిమాకు పోతున్నారు. వాళ్ళ పేర్లు నాకు తెలుసు మీరు మారుమనస్సు పొందామని చెప్పి ఇలా చేస్తున్నారా అని అటుంటే ఇదేంది! మా నాన్న డబ్బులిచ్చి నన్ను సినిమాకు పోమ్మంటాడే అని ఇంకా ఆశ్చర్యపడ్డాడు. ఇదేదో ఒక ప్రత్యేక వాతావరణంలా వుంది అని అనుకొని మరుసటి రోజు మళ్ళీ వెళ్ళాడు.

రెండవ రోజు తిరిగి హెబ్రోను ఆవరణములోనికి వచ్చిన వెంటనే ఒక వ్యక్తి తిమోతిగారిని పలకరించి ప్రశాంత వాతావరణములోనికి తీసుకొనివెళ్ళి సువార్త చెప్పాడు. సువార్త వింటుంటే తిమోతిగారికి తాను చేసిన పాపాలన్నీ గుర్తుకువస్తున్నాయి. కళ్ళ నిండా నీళ్ళు; హృదయం దుఃఖంతో నింపబడింది. రోజుకు ఒక అబద్ధం ఆడితే 10 రోజులకు పది, నెలకు 30 ఇలా 10 సంవత్సరాలకు ఎన్ని? ఇవిగాక మిగిలిన పాపాల సంగతేంటి? అని ఆలోచించి

హృదయం బరువెక్కింది. అప్పుడు సువార్త చెప్తున్న వ్యక్తి, నీవే కాదు సహోదరుడా! ఒకప్పుడు నేను కూడా అటువంటి వాడినే అయితే యేసుక్రీస్తు ప్రభువు నా పాపము కొరకు చనిపోయారని ఆయన యందు విశ్వాసముంచితే నా పాపాలు క్షమిస్తారని తెలిసినప్పుడు నేను కూడా ఆయనను నమ్ముకొన్నాను, నెమ్మదిని పొందాను. నీవు కూడా ప్రార్థన చెయ్యి అన్నాడు. తిమోతి గారు ప్రార్థన చేయడం నాకు రాదన్నాడు. అయితే సువార్తికుడైన ఆ వ్యక్తి నేను చెప్పింది పలకమన్నాడు. "ప్రభువా! నేను పాపిని నా పాపము క్షమించు. నాకోసం నీవు చనిపోయావని సమాధి చేయబడ్డావని, తిరిగి లేచావని నాకొరకు తిరిగి రాబోతున్నావని నేను విశ్వసిస్తున్నాను. నా పాపాలన్నీ నీ రక్తములో కడుగుము. యేసునామమున ప్రార్థిస్తున్నాము

తండ్రీ!! ఆమేన్!!". ఇది 1964, ఏప్రియల్ 27న తిమోతిగారు పలికిన ప్రార్థన. వెంటనే ఏదో తెలియని నెమ్మది, ఏదో దొరికింది ఇది వరకు నేను అనుభవించని శాంతి నాకు దొరికిందని తలంచాడు.

ఒక చిన్న బైబిల్ తీసుకొని తిరిగి లాడ్జికి వెళ్ళి తలుపులు వేసికొని చదవడం ప్రారంభించాడు. ఏదో సంతోషం. తన గదిలో యేసుక్రీస్తు ప్రభువు తిరుగుతున్నట్లు అనిపించింది. కాని కనిపించడం లేదు. దేవుని వాక్యం మాట్లాడుతుంది. సంతోషం తట్టుకోలేక పోయాడు. లేచి నాట్యమాడుతున్నాడు. ఇంటికెళ్ళి (మదనపల్లి) వాళ్ళ అమ్మతో చెప్పాడు. అమ్మా! నేను అంతా దొంగ బ్రతుకు బ్రతికాను. నన్ను దొంగ అనమన్నాడు. వాళ్ళ అక్క దగ్గరకెళ్ళి అక్కా! నీ ఉండీలో డబ్బులు దొంగతనం చేశాను. దొంగ అని పిలువమని చెప్తుంటే ఇంట్లో వాళ్ళకు ఏమీ అర్థం

కాలేదు. తిమోతిగారు మాత్రం తన పాపాలు ఒప్పుకొని సరిచేసుకుంటున్నాడు. మారుమనస్సుకు తగిన ఫలాలు ఫలించాలని తపన పడుతున్నాడు (మత్తయి 3:7). అటువంటప్పుడు ఊరిలో కొందరొచ్చి ఏంటీ! మీ అబ్బాయి సంగతి అని తిమోతిగారి తండ్రిని అడిగారు వాళ్ళు. తండ్రి నన్నడగవద్దు వాడినే అడుక్కోండి అని చెప్పాడు.

తిమోతి గారు తిరిగి 1964 సం॥లో మొట్టమొదటి యౌవనస్థుల కూడిక హెబ్రోనులో జరుగుతుండగా వచ్చాడు. యౌవనస్థుల కూడికకు పంపడం తల్లిదండ్రుల కిష్టం లేకపోయినా నీకేదో నెమ్మది దొరికిందన్నావు కదా! వెళ్ళు అయినా, నిన్ను పంపించే దానికి మాకు నెమ్మది లేదన్నారు. ఎలాగోలాగు యౌవనస్థుల కూడికకు హాజరయ్యాడు. బాప్తీసాల గూర్చి చెప్తుంటే విని బాప్తీస్మానికి పేరిచ్చాడు. కానీ, అది ఎలా చేస్తారో తిమోతిగారికి

తెలియదు. అయితే పట్టికలో మొదటి పేరుంది. వెళ్ళి బిర్రుగా నిలబడ్డాడు. సహోదరుడు దాసన్ గారు (బాప్తీస్మమిచ్చే వ్యక్తి) ఓపికతో తిమోతిగారిని అర్థం చేసుకొని బాప్తీస్మ మిచ్చాడు. తిరిగి హస్త నిక్షేపణ కార్యక్రమంలో పాలు పొందాడు. అప్పుడు తిమోతి గారు అనుకోకుండానే భక్తసింగ్ గారిని చూచి నా పేరు మార్చండి సహోదరా! అని అడిగాడు. వెంటనే భక్తసింగ్ గారు "సహోదరుడు కృష్ణమూర్తి పేరును ఈ దినం నుంచి తిమోతిగా మార్చుతున్నాము" అని చెప్పారు. కృష్ణమూర్తి చచ్చి పోయాడు తిమోతి బ్రతికాడు.

**<u>సేవా పిలుపు :</u>**

1964 లో యౌవనస్థుల కూడిక చివరిరోజు సహో॥ భక్తసింగ్ గారు బలమైన వర్తమానమి స్తున్నాడు. సేవకు సమర్పించుకోమని చెప్తున్నాడు.

ఇది వింటున్న తిమోతిగారు 'సేవంటే నాకేం తెలుసులే అని అనుకున్నాడు'. వెంటనే వాక్యంలో సేవంటే నాకేం తెలుసులే అను అనుకొంటున్నావు గదా! అని వచ్చింది. తిమోతిగారు వాయమ్మో! ఇదేంది నేనేమనుకుంటే అదే చెప్తున్నాడని లోపల గంగరగోళ పడుతూ చెయ్యి ఎత్తితే ఏమౌతుందో అని అనుకొంటుంటే వాక్యంలో చెయ్యి ఎత్తు ఏమీ కాదు అని వచ్చింది. తిమోతి గారు మళ్ళీ ఆశ్చర్యపడ్డాడు. చెయ్యి ఎత్తితే నెమ్మది వస్తుందని చెప్పి చెయ్యి ఎత్తాడు. కొంచెం నెమ్మది పొందాడు. తిరిగి భక్తసింగ్ గారితో చెప్పి స్వగ్రామమైన మదనపల్లెకు వెళ్ళాడు.

గ్రామంలో అడుగుపెట్టినప్పటి నుంచి ఎన్నో సమస్యలలో చిక్కుకొన్నాడు. ఇంట్లోవాళ్ళు పిచ్చి పట్టిందేమోనని పిచ్చాసుపత్రికి తీసుకెళ్ళారు. ఎవరైనా మందుపెట్టారేమో అనుకున్నారు. హిందువుల మఠంలో చేరిస్తే, వీడి తిక్క కుదురుద్ది

అని అనుకొన్నారు. ఎవరెన్ని చేసినా తిమోతిగారిలో మార్పురాలేదు. తను నమ్మిన దేవుడే నిజమైన దైవమని నిశ్చయించుకొన్నాడు. చివరికి ఇంట్లో ఉండే వాళ్ళ నాన్నగారు, వాళ్ళ బాబాయి మేడమీదికి తీసుకెళ్ళి ఎంతో బుజ్జగించి కొన్ని మంచి మాటలు చెప్పారు. వాళ్ళ బాబాయి గారు చూడురా! జీవితంలో ప్రతి మనిషికి ఒక మలుపు ఉంటుంది. ఆ మలుపులో మంచి నిర్ణయం చేస్తే మనిషిగా బాగా బ్రతుకుతావు. లేకపోతే ఉభయ భ్రష్టుడవౌతావు అని చెప్పాడు. ఎంతకీ తిమోతిగారిలో మార్పురాలేదు. ఎందరో మునులు, ఋషులు ఎన్నో ఏళ్ళ నుంచి తపస్సు చేస్తూ గడ్డాలు పెంచుకొని, దైవమర్మం తెలుసు కోవాలని చేతగాక ఇంకా దొరకలేదని చెప్తుంటే... ఇంతలేవురా! నీకప్పుడే దొరికిందా అని హేళన చేశారు. చిట్టచివరికి ఒక షరతు పెట్టారు. నీవు గనుక ఆ మతాన్ని వదలకపోతే నీకు ఈ యింటిలో

ఎలాంటి భాగం లేదు, ఆస్తిలో కూడా భాగం లేదు. రెండు రోజుల్లో తీర్మానించుకోమని చెప్పి సమయ మిచ్చారు.

తిమోతిగారు ఈ మాటలు విని మోకరించి ప్రార్థన చేసుకొంటున్నాడు. కొంచెం సేపు ప్రార్థన చేసిన తరువాత ఒక గంభీరమైన స్వరంతో "దావీదు సమస్తమును సంపాదించుకొనెను" అని ఆంగ్లంలో రెండు సార్లు వినబడింది. అలాంటి స్వరం అంత గంభీర స్వరం ఎప్పుడూ వినలేదని నివ్వెరపోయాడు. అది బైబిల్లో ఉందని తెలుసు. కానీ అది ఎక్కడ ఉందో తెలియదు. స్వరం వినిన తరువాత రెట్టింపు సమాధానం వచ్చింది. వాళ్ళు రెండు రోజులు సమయమిస్తే 15 నిమిషాలకల్లా తల్లిదండ్రుల దగ్గరకెళ్ళి ఈ విషయం చెప్పాడు. అమ్మా నాన్న మీరు కూడా నాలాగ బైబిలు పట్టుకొని వస్తారని దేవుడు నాకు చెప్పుతున్నాడని చెప్పాడు. మీ ఆస్తిలో

నాకెలాంటి భాగం వద్దని చెప్పాడు. అందుకు తిమోతి గారి తల్లిదండ్రులు నీకు పిచ్చి పట్టిందిరా! మాకేమి పిచ్చిపట్టిందని చెప్పారు". రిజిస్టర్ ఆఫీసుకు తీసికెళ్ళి తొమ్మిది ఆస్తి పత్రాల మీద సంతకం చేయించారు. రిజిస్టార్ చదవి సంతకం పెట్టు అని అటుంటే... నాకేం అక్కరలేదు సార్ అని తిమోతిగారు రిజిస్టార్కు జవాబిచ్చాడు. ఇదంతా జరిగిన తరువాత తల్లిదండ్రులు ఏడుస్తున్నారు. తిమోతిగారు బట్టలన్నీ ఒక సంచిలో సర్దారు. జేబులో 100 రూపాయలు పెట్టి సాగనంపారు. సాగిపోతున్నపుడు తిమోతిగారి బాబాయి "నాయనా! నీ ఆస్తి తీసుకోవాలని ఇలా చేయడం లేదు. నీవు మారాలని మాత్రమే ఈ పని చేశాం. ఈ ఇంటి తలుపులు నీకెప్పుడూ తెరవబడే ఉంటాయి. నీవెప్పుడైనా రావచ్చు. పెండ్లి చేసుకోవాలని

అనిపిస్తేరా, ఒక మంచి అమ్మాయిని చూసి పెండ్లి చేస్తామని చెప్పాడు".

వట్టి చేతులతో సేవకు వెళ్ళిన తిమోతిగారికి దేవుడే తండ్రిగా, తల్లిగా, స్నేహితునిగా, నాయకుడిగా, బంధువుడుగా వున్నాడు. "స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండా తన చంటిపిల్లను మరచునా, వారైనా మరచుదురు గాని నేను నిన్ను మరువను". యెషయా 49:15 అన్న దేవుని వాక్యం తిమోతిగారి జీవితంలో అక్షరాలా నెరవేరింది. 1964 నుంచి 1971 వరకు భక్తసింగ్ గారితో కలిసి ఎంతో సేవచేశారు. ఎన్నో సువార్త దండయాత్రలలో పాల్గొన్నారు. దాదాపు భారతదేశం లోని పలు భాగాలలో ప్రభువు మార్గాన్ని బోధించాడు. అనువాదకుడిగా, హార్మోనిస్ట్‌గా కూడా సేవలో ఎంతో సహకరించారు.

## వివాహము :

1971 సం॥ మార్చి నెల 1వ తేదీన సహోదరి నిస్సీ గారి కుమార్తె గుడి (ఎలిజబెత్) గారితో తిమోతిగారు వివాహములో జతపరచబడిరి. వివాహ విషయంలో కూడా భాషా సమస్య కారణంగా తిమోతిగారు మొదట దానిని వద్దనుకున్నా ప్రభువు చిత్తానికి తలవంచాడు. వివాహానంతరం ఎటువంటి సమస్యలు వచ్చినా వివాహం కొరకై దేవుడిచ్చిన వాగ్దానంను చేపట్టుట ద్వారా (మత్తయి 8:26) ఎంతో సంతోషకరమైన వివాహ జీవితాన్ని గడిపారు. ఒంటరిగా వచ్చిన తిమోతిగారికి దేవుడు భార్యను, ముగ్గురు పిల్లల నిచ్చి వారి నందరిని పోషించాడు. పిల్లలు కూడా పెద్దవారై ప్రభు మార్గంలో స్థిరపడి కుటుంబస్థులుగా చేయబడ్డారు. వారే సహో॥ జాన్, సహోదరి షారోన్ లిడియా, సహో॥ డేవిడ్

సాలమన్ (చోటు).

**పరిచర్య:**

వివాహానంతరం, పరిచర్య నిమిత్తం ఆయా పట్టణాలకు దేవుని సేవకుడుగా పంపబడ్డాడు.

1974 నుంచి 1976 గుంతుకల్లు; 1977 నుంచి 1995 ఖమ్మం; 1995 నుంచి 1998 కడప; 1998 నుంచి 2000 గుంటూరు; 2000 విజయవాడ; 2001 నుంచి 2005 ఖమ్మం; 2005 నుంచి 2007 తెనాలి; 2007 నుంచి 2010 నల్గొండ.

2011 జనవరి 16 నుంచి డిసెంబర్ 5, 2020 ప్రభువు చిరాగృహపు పిలుపు నందుకొనేవరకు హెబ్రోనులో దైవసేవకుడుగా ఉంటూ దేవునికి మహిమకరంగా జీవించాడు. చేతిముద్రలు పడాలంటే చేతులు కష్టపడి ఉండాలి. అలాంటి వాళ్ళ వ్రేళ్ళకే త్వరగా ముద్రలుపడతాయి.

పనిచేయని వాళ్ళ వేళ్ళు ముద్రపడవు. సేవా జీవితంలో తిమోతిగారు కూడా తానెదుర్కొన్న ప్రతి కష్టంలో దేవుని ముద్రను చూపించాడు. సేవా జీవితంలో తనదంటూ ఒక ముద్రను ప్రపంచానికి అందించాడు. రెండు తెలుగు రాష్ట్రాలలో, దక్షిణ భారతదేశంలో తనకంటూ ఒక సేవా గుర్తింపు పొందినాడు. దేశంలో, ప్రపంచంలోని పలు స్థలాల్లో వాక్యోపదేశకునిగా, ఆత్మలను రక్షించుటలోను, సంఘమును కట్టుటలో ప్రభువు చిత్తానుసారముగా విరివిగా వాడబడ్డాడు.

ఈ పాపపు ప్రపంచానికి ప్రభుమార్గ బోధకుడైన తిమోతిగారు ఒక సవాలు విసరుతున్నాడు. నేను కూడా మీలాగ గుళ్ళు, గోపురాలు తిరిగాను. వ్రతాలు, పూజలు చేశాను. సకల ఐశ్వర్యాలు అనుభవించు స్తోమత కలిగియున్నాను. అయినా నాకెక్కడా సంతోషం, నెమ్మది దొరకలేదు. జీవము

గల దేవునిలో పాపము పరిహరించే పరమాత్ముడైన యేసుక్రీస్తు రక్తములోనే నాకు శాంతి, సమాధానం దొరికిందంటున్నాడు. అంతేకాదు నా జీవితానికి నిరీక్షణ దొరికింది. భూమి మీద సమాధానం, చనిపోతే పరలోకరాజ్యం అంటున్నాడు. మరి దీనిని చదువుతున్న నీవు ఇట్టి నిరీక్షణ కలిగియున్నావా? లేదా లేనట్లయితే ఈనాడే యేసుక్రీస్తు ప్రభువును నీ స్వంత రక్షకుడిగా అంగీకరించు, యేసుక్రీస్తు ప్రభువు నీకు నిత్యజీవాన్నిస్తాడు. ఇప్పుడే ప్రభువు తన చేతులు చాచియుండగా నీవాయన చేతులలోనికి రమ్ము!!! "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా! నా యొద్దకు రండి... నేను మీకు విశ్రాంతి కలుగజేతును" మత్తయి 11:28.

## తిమోతిగా మారిన కృష్ణమూర్తి

భారతదేశపు భక్త – బొంతల కృష్ణమూర్తి
బతుకులో బరువెక్కి
భగవంతుని భాగ్యం కొరకు బయలుదేరాడు.
భగవంతుని భాగ్యం ఎక్కడ
దొరుకుతుందోనని
భారతదేశాన్ని బలంగా చుట్టారు.
భగవంతుని భాగ్యాన్ని కానలేక
భగవంతుడు లేడు భక్తిహీనుడు
లేడనుకొన్నాడు బతుకెందుకులె బలి
చేసుకొందామనుకొన్నాడు
బలిచేసుకోవడానికి బరితెగించాడు
బలికాకపోతే బ్రతుకేమౌతుందోనని
బలమైన ఆలోచనతో బ్రతికి బయటపడ్డాడు.

కాశీ నుండి కన్యాకుమారి
వరకు కనిపించని శాంతి
కనిపించిన క్రైస్తవ కలంలో కనుగొన్నాడు
క్రైస్తవ్యాన్ని కాదనుకొని కకావికలమౌతూ
కాలికి బుద్ధి చెప్పి కలియతిరిగి
క్రైస్తవ కలం చెప్పిన దాన్ని కలుసుకున్నాడు
కలలోనైనా కనిపించని కమ్మదనం
క్రీస్తులో చూచి కనికరం పొందాడు
కుటుంబాన్ని కులాన్ని వదిలి సేవకులంలో
చేరాడు క్రీస్తు ప్రజలతో శ్రమలననుభవిస్తూ
క్రీస్తులో 60 దశకాలు క్రైస్తవుడుగా జీవించి
క్రీస్తును బోధించి క్రీస్తు చెంతకు చేరి
కిరీటధారుడై కూర్చున్నాడు!!!!